క్లుప్తంగా

సుంకులాపరమేశ్వరి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో వెలసిన సుంకులాపరమేశ్వరిదేవి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. వివిధ రూపాల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి రూ. 37.69 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, ఈఓ నరసయ్య తెలిపారు. ఆరు నెలల కాలానికి ఈ ఆదాయం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. కాగా వారం రోజుల్లో అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నగరపాలకలో నామినేషన్ల సహాయ కేంద్రం



నామినేషన్ల సహాయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సోమవారం నామినేషన్ల సహాయ కేంద్రం ప్రారంభించారు. అక్కడ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి భార్గవ్ తేజ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈనెల 18 వ తేదీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

మహిళలు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

కర్నూలు (టౌన్) : ఆత్మరక్షణ కోసం మహిళలు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేవీఆర్ డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బ్లాక్‌బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు కొంత సమయాన్ని మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, దేవికారాణి పాల్గొన్నారు.

19,20 తేదీల్లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటన

కర్నూలు(సెంట్రల్): ఏపీ న్యాయ యాత్రలో భాగంగా ఈనెల 19, 20వ తేదీల్లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జిల్లాలో పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19వ తేదీన ఆలూరు, ఆదోని, కోసిగిలలో, 20వ తేదీన కోడుమూరు, కర్నూలులో ఆమె పర్యటించనున్నట్లు చెప్పారు. ఈ యాత్రను కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆదర్శమయం రామపాలన



మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

కర్నూలు కల్చరల్: నేటి తరం పాలకులు రామచంద్ర ప్రభువును ఆదర్శంగా తీసుకుని ప్రజలను పాలించాలని చిత్రకారుడు, కథా వాచకుడు హరిబేల్ ఉదయ్‌కుమార శ్రీచక్ర అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం 'శ్రీరామాయణం శ్రీరామ రాజ్యం' అనే అంశంపై ఉపన్యసించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నగరూరి దీప్తి, కార్పొరేటర్ నగరూరి శ్రీనివాసులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శమంతకమణి, మాజీ కార్పొరేటర్ శేషయాదవ్, జెట్టి యాదవ్, అర్చకులు గిరిశర్మ, కృష్ణకాంత్, సంజీవనాథ్, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి అల్లాబకాష్ మియా షరీఫ్ ఉరుసు

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని హజరత్ అల్లాబకాష్‌మియా షరీఫ్ ఉరుసు ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు దర్గా పూజారి ఎస్ఎండీ మహబూబ్‌బాషా సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు రాత్రి గంధోత్సవం, 20వ తేదీ మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం కిస్తీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 21వ తేదీ జియారత్ పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

- జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి
- ఎన్నికల ప్రచారంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి
- 10 వ వార్డులో గడప గడపకు ఇంతియాజ్ కార్యక్రమానికి విశేష స్పందన
- పార్టీ అభ్యర్థులకు ఘన స్వాగతం పలికిన వార్డు ప్రజలు



పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఇంతియాజ్, బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, నాయకులను పూలమాలతో స్వాగతం పలుకుతున్న 10వ వార్డు ప్రజలు

కర్నూలు (టౌన్): ఎన్నికల్లో వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం నగరంలోని 10 వ వార్డు ఉస్మానియా కళాశాల రోడ్డు, మాసుంబాషా దర్గా, లాల్ మసీదు తదితర ప్రాంతాల్లో గడప గడపకు ఇంతియాజ్ కార్యక్రమం జరిగింది. కర్నూలు అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులు ఇంతియాజ్, బీవై రామయ్య , మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అహమ్మద్ అలీఖాన్, జిల్లా సచివాలయాల కో-ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి, మెయిజ్‌ఖాన్‌లతో కలిసి రామసుబ్బారెడ్డ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ఏరియాల్లో ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, ఎంపీ అభ్యర్థి రామయ్యను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. చిరు వ్యాపారులతో మాట్లాడారు. జగనన్న పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. 58 నెలల పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. కరోనా సమయంలో అన్ని రాష్ట్రాలు, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మన రాష్ట్రంలో మాత్రం జగనన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలబడి అవసరమైన సహాయ సహకారాలు అందించారన్నారు. ఇవన్నీ చూసి ప్రతి పక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. ఎలాగు గెలవలేమనే పరిస్థితికి తెలుగుదేశం నాయకులు వచ్చారన్నారు. చంద్రబాబు ఏనాడు కూడా పేదలకు ఒక్క మంచి పని చేయలేదని, అందుకే వారు ఆయనను నమ్మరన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి మాట్లాడుతూ 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పేద ప్రజలను ఆదుకున్న దాఖాలాలు లేవన్నారు. దీంతో ఆయనకు మళ్లీ ఓటమి తప్పదని సర్వేలు తేల్చాయన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలు ఆశీర్వదిస్తారన్నారు. అనంతరం కర్నూలు అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పేద ప్రజలకు వైఎస్ జగన్ సారథ్యంలోనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ షేక్ యూనుసు బాషా తదితరులు పాల్గొన్నారు.

23న వీరహనుమాన్ శోభాయాత్ర

- రక్షణ చర్యలు చేపట్టాలని డీఎస్పీకి వీహెచ్‌పీ,బజరంగ్‌దళ్ వినతి



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు: నగరంలో ఈనెల 23న వీరహనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహిస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధి బృందం డీఎస్పీ విజయశేఖర్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం సమర్పించారు. పాతబస్తీ జమ్మిచెట్టు లలితా పీఠం నుంచి బుధవారపేట ఓంసాయి సీతారామాంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగుతుందని అందులో పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, కార్యదర్శి భానుప్రకాష్, సహాయ కార్యదర్శులు ఈపూరి నాగరాజు, గోవిందరాజులు, గిరిబాబు, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ, వరసిద్ధి వినాయక ప్రఖండ అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యక్షుడు బాబురావు, తెలుగు భగీరథ మండ్ల హరికృష్ణ, గజరాతి సు రేష్, సాయిప్రవీణ్ డీఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

హ్యాట్రిక్ విజయం తథ్యం

- జగనన్నతోనే పేదలకు భరోసా
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, సతీష్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ

కర్నూలు సిటీ: రానున్న ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందని ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు, టీజీవీ నగర్‌లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా జరిగిన మేలును వివరించారు. వారికి ఆయా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో తమ బతుకులు బాగుపడ్డాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. ప్రజల్లో జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి చంద్రబాబు బ్యాచ్ కడుపు మంటతో రగిలిపోతోందన్నారు. 2014 ఎన్నికల్లో హామీలతో కూడిన మ్యానిఫెస్టో టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారన్నారు. కానీ జగనన్న ప్రతి సచివాలయం.. ప్రతి కార్యాయలంలో ఓపెన్‌గా మ్యానిఫెస్టో పెట్టారన్నారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారని చెప్పారు. మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండి అని అడిగే దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. చంద్రబాబుకు ఆ ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. గతంలో సంక్షేమ పథకాలు అందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. పల్లెల్లో అనారోగ్యానికి గురైతే మందులకు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సేవలు అందించారన్నారు. మొన్నటిదాకా ఆర్థికంగా ఉన్నోళ్లకు మాత్రమే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పేదల దరిచేర్చిన జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడంతో పాటు, విద్యలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఒక వైపు సంక్షేమం, మరో వైపు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో జిల్లాలో గతంలో కంటే 7 శాతం పేదరికం తగ్గిందని, కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే నీతి ఆయోగ్ నివేదికలు ఇచ్చాయన్నారు. తెలుగుదేశం పార్టీ వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, వారి మాయ మాటలు నమ్మితే మోసపోతారన్నారు. ఎన్నికల్లో ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమర్, ఎంపీటీసీ సభ్యులు హనుమంతు, రామ్‌నాథ్ రెడ్డి, శేఖర్, సర్పంచ్‌లు విద్యాసాగర్, శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీ నెహిమియా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, సింగిల్ విండో చైర్మన్ వినయ్‌కుమార్ రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, వంశీధర్‌రెడ్డి, ప్రసాదు, మహేశ్వర రెడ్డి, పెరుగు భాస్కర్ రెడ్డి, బీచుపల్లి, పెరుగు హరినాథ్ రెడ్డి, అఖిలేష్ రెడ్డి, చిన్న లక్ష్మన్న, మోహన్ బాబు, మహానందిరెడ్డి,అమర్నాథ్ రెడ్డి, ఉల్చాల విష్ణువర్ధన్ రెడ్డి, బోయ వెంకటేష్, పి.రుద్రవరం వెంకటేష్ ,బైరాపురం క్రిష్ణ, వెంకటేష్, గొందిపర్ల గోపాల్, ఆదాము, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమికి బుద్ధి చెప్పండి



- పారదర్శక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడండి
- ఎన్నికల ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

మహిళను ఓటు అభ్యర్థిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అధికారం కోసం కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్న టీడీపీ కూటమికి మరోసారి ఓటుతో బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తూ కరపత్రాలు అందజేశారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ నేరుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పోటీ పడలేక చంద్రబాబు పొత్తులతో వస్తున్నారన్నారు. 2014లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పట్టించుకోలేదన్నారు. వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అలాంటి బాబు మళ్లీ ఇప్పుడు బీజేపీ, జనసేనతో పొత్తుపెట్టుకుని వస్తున్నాడని గుణపాఠం చెప్పాలన్నారు.ఈసారి ఆయన ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు గల తేడాను గమనించాలన్నారు. గతంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సు ఉండాలన్నారు. ఇప్పుడు నేరుగా అర్హుల ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. పారదర్శక పాలన కొనసాగాలంటే, పేదలకు మరింత మేలు జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, ఇందుకు మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాగ లక్ష్మీరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు భీమాశంకర్‌రెడ్డి, సుకుమార్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించడంలో ఆశాలు కీలకం



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): మాతాశిశు మరణాలు తగ్గించడంలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం స్థానిక మహిళా ప్రాంగణంలో 6, 7 మాడ్యుల్స్‌పై నూతనంగా నియమితులైన ఆశాలకు 10 రోజుల శిక్షణ కార్యక్రమం మొదలైంది. ఈ సందర్భంగా డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలయ్యేలా చూడాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనతపై, సరైన వివాహ వయస్సుపై అవగాహన కల్పించాలని సూచించారు. నవజాత శిశువుల గృహ సందర్శన చేసి కిట్లను ఉపయోగించి పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త వారి పరిధిలో ఉన్న గర్భిణీ, బాలింతలు, కౌమార బాలికలు ఎంత మంది ఉన్నారు, వారి ఆరోగ్యస్థితిగతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి గర్భవతికి 01244588000 నెంబర్ నుంచి వాయిస్ వస్తుందని, ఒకవేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే ఐవీఆర్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా మూడుసార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. మళ్లీ ఆ సందేశాలను వినాలనుకున్న ఎడల 14423 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి వినవచ్చన్నారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లోని గర్భిణులకు, బాలింతలకు అవగాహ న పెరుగుతుందని, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు సేవలు అందుతాయన్నారు. ఈ విష యంపై తమ పరిధిలోని గర్భిణ/లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంయూ డాక్టర్ ఉమా, డీఎస్‌ఓ డాక్టర్ నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, ఎస్‌ఓ హేమసుందరం, మలేరియా అధికారి నూకరాజు, డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి ఇందిర, డెమో ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

17న రాంబొట్ల ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఈనెల 17వ తేదీన శ్రీసీతారామ వసంత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నగరూరి దీప్తి, ఈవో దినేష్ పేర్కొన్నారు. సోమవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంబొట్ల ఆలయం చాలా పురాతనమైందన్నారు. ఇక్కడ నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 17వ తేదీ ఉదయం 7.30 గంటలకు శ్రీరాముల వారి జననం, లాలిసేవ, ఉదయం 9 గంటల నుంచి శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్పొరేటర్ నగరూరి శ్రీనివాస్ మాట్లాడుతూ 18వ తేదీ ఉదయం 10 గంటలకు సీతారాముల పట్టాభిషేకం, 19వ తేదీ సాయంత్రం 5 గంటలకు సీతారాముల దివ్య మంగళ రథోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు గిరి శర్మ, కృష్ణకాంత్ కమిటీ సభ్యులు మల్లేష్, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ హజ్ కమిటీ చైర్మన్ అహ్మద్‌హుసేన్



వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన అహ్మద్ హుస్సేన్, చిత్రంలో ఎమ్మెల్యేలు శిల్పా, హాఫీజ్‌ఖాన్

ఆత్మకూరు: నంద్యాల జిల్లాలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. 30 సంవత్సరాల పాటు టీడీపీలో కొనసాగి పలు పదవులు చేపట్టిన ఆ పార్టీ నాయకులు అహ్మద్ హుసేన్ సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకుడిగా, రాష్ట్ర మాజీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ పదవులతో పాటు ఆయన కడప పార్లమెంట్ టీడీపీ అబ్జర్వర్‌గా 14 సంవత్సరాలు, అనంతపురం టీడీపీ ఇన్‌చార్జిగా 12 సంవత్సరాలు, ట్రేడ్ యూనియన్ లీడర్‌గా ఆర్టీసీలో 20 సంవత్సరాలుగా పనిచేశారు. ఇటీవల ఆయన టీడీపీకి రాజీనామా చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో కేసరపల్లి నైట్ స్టే పాయింట్ వద్ద వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతో పాటు టీడీపీ జిల్లా తాలిమీ బోర్డు అధ్యక్షులు ముఫ్తీ నూర్ మహ్మద్, టీడీపీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ ముస్తఫా, మహమ్మద్ ఇలియాస్ కూడా పార్టీలోకి చేరారు. వీరి వెంట స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు మండల మీట్

కల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు,ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

మైనార్టీ కార్యదర్శిగా బాషా

సి.బెళగల్: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్ఎం బాషా వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. ప్రస్తుతం ఈయన కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఉన్నారు.

వలంటీర్ల రాజీనామా

కల్లూరు: మండలంలోని పర్ల గ్రామానికి చెందిన 18 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తికి రాజీనామా పత్రాలను అందజేశారు. స్వచ్ఛందంగానే రాజీనామా చేసినట్లు వారు తెలిపారు.

అంధుల ఉజ్వల భవిష్యత్తుకు డిజిటల్ లైబ్రరీ

- రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా కర్నూలులో ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ డా.జి. సృజన



అంధుల డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న కలెక్టర్

కర్నూలు(అర్బన్): అంధ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదట కర్నూలు బీ క్యాంప్ క్వార్టర్స్ విజ్ఞాన మందిరం సమీపంలోని జాతీయ అంధుల సమాఖ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అంధుల డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. సీపీఓ పర్యవేక్షణలో అంధుల కోసం నిర్వహించే ఈ లైబ్రరీని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అందరికి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొని రావడం ముఖ్యమన్నారు. దృష్టి లోపం ఉన్న వారికైనా, ఫిజికల్లీ చాలెంజ్ వారికి చదువుకునే పుస్తకాల నుంచి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, సాహిత్య పరమైన పుస్తకాలను డిజిటల్ లైబ్రరీలో ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన వారిలాగే జ్ఞానం పొందాలనే మంచి సంకల్పంతో ఈ లైబ్రరీని ఏర్పాటు చేశామన్నారు. దృష్టి లోపం ఉన్న వారికి డిజిటల్ లైబ్రరీలో ఉపయోగిస్తున్న టెక్నాలజీ ద్వారా పుస్తకాలను ఆడియో రూపంలో విని చదువుకోవచ్చనే విషయం గురించి తెలుసుకోవడం ఇది మొదటిసారని కలెక్టర్ తెలిపారు. అలాగే మనం ఇతరులకంటే ఎందులోనూ తక్కువ కాదనే భావన అంధుల్లో కల్పించి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీలో భాగస్వామ్యులైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి లైబ్రరీలను ఇంకా ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వివిధ రకాల దివ్యాంగులకు కొత్త సాఫ్ట్‌వేర్‌లు, ఇంకా కొత్త వ్యవస్థలు ఏవైనా ఉంటే వాటి గురించి తెలుసుకొని వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. ముందుగా అంధుల కోసం ఏర్పాటు చేసిన కిబో ఎక్స్‌ప్రెస్, ఎల్ఈఎక్స్ ఎయిర్ అనే పరికరాలను ఎలా ఉపయోగించాలి? ఆడియో అవుట్‌పుట్, తదితర అంశాలను ఆమె పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ లైబ్రరీకి అవసరమైన ఆరు కంప్యూటర్లను కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఓ హిమప్రభాకర్‌రాజు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, సీపీఓ కార్యాలయ ఏడీభారతి, జాతీయ అంధుల సమాఖ్య కర్నూలు శాఖ అధ్యక్షుడు పుష్పరాజ్, ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్, సభ్యులు రాఘవయ్య, విశ్వనాథరెడ్డి, కిబో పరికరం శిక్షకుడు తనూజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.